కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

జూలూరుపాడు, సెప్టెంబర్ 4: మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కల్యాణమండపంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎం సహాయ నిధి చెక్కులను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ పంపిణీ చేశారు. తహసీల్దార్ స్వాతి బిందు, వెంకటరెడ్డి, మధుసూదన్‌రావు, నర్సింహారావు పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయశాఖ అధికారి పర్యటన

పంటను పరిశీలిస్తున్న బాబూరావు

పాల్వంచ రూరల్, సెప్టెంబర్ 4: వరదల వల్ల పంట నష్టం జరిగిన ప్రాంతాల్లో జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.బాబూరావు బుధవారం పర్యటించారు. మండలంలోని ఉల్వనూరు, సూరారం, పాండురంగాపురంలో ఆయన పర్యటించి పత్తి, వరి పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టాన్ని మూడు రోజుల్లో అందజేయాలని ఏవో శంభో శంకర్‌ను ఆదేశించారు.

ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా పోషణ మాసం

కరకగూడెం, సెప్టెంబర్ 4: చిన్నారులు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ప్రతి ఏటా సెప్టెంబర్ మాసంలో పోషణ మాసం నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ మణుగూరు జీడీపీవో జయలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషన్ మాసంలో పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహార పదార్థాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భద్రమ్మ, భవాని, పద్మ, రమాదేవి, మంగతాయారు, స్వరూప, ఆశాలు పాల్గొన్నారు.

కెపాసిటర్‌తో విద్యుత్ సమస్యలకు చెల్లు..
ట్రాన్స్‌కో డీఈ జీవన్‌కుమార్

డీఈకి సమస్యలు వివరిస్తున్న రైతులు

సారపాక, సెప్టెంబర్ 4: రైతులు వ్యవసాయ పొలాల్లో మోటార్ల వద్ద కెపాసిటర్ వాడడం వల్ల లోవోల్టేజీ, అధిక విద్యుత్ సమస్య ఉండదని ట్రాన్స్‌కో డీఈ జీవన్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగినేని ప్రోలు రెడ్డిపాలెం రైతులు విద్యుత్ సమస్యలపై ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. పొలాలు ఎప్పుడూ తడిగా ఉంటాయి కాబట్టి మోటర్లు దగ్గర స్విచ్ ఆన్ ఆఫ్ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, చెక్కతో కూడిన వస్తువులను దగ్గర ఉంచుకోవాలని తెలిపారు. విద్యుత్ సరఫరా అవుతుందో లేదో చెక్ చేసుకుని ఆన్ ఆఫ్ చేయాలని సూచించారు. సీఎం ఆదేశాల మేరకు కేవలం రూ.845కే మీటర్లు అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని మీటర్లు లేని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏడీ వేణు, సారపాక ఏఈ గుర్రం ఉపేందర్, ఏఎల్ఎం ప్రసాద్, కోటేశ్వరరావు, శంకర్, వెంకట్రావు, శ్రీను, హుస్సేన్, రైతులు పాల్గొన్నారు.

యువకుల సాహసం.. వ్యక్తికి పునర్జన్మ

వాగులో కొట్టుకుపోతున్న వ్యక్తిని కాపాడుతున్న యువకులు

టేకులపల్లి, సెప్టెంబర్ 4: ముగ్గురు యువకుల సాహసం.. ఓ వ్యక్తికి పునర్జన్మను ప్రసాదించింది. వరద ఉధృతితో వాగులో పడిన వ్యక్తిని యువకులు కాపాడారు. సుజాతనగర్ మండలం స్టేషన్ బేతంపూడి పంచాయతీకి చెందిన బానోత్ రవికిరణ్, బుధవారం ఉదయం తూర్పుగూడెం సమీపంలో వాగులో కొట్టుకుపోతుండగా అక్కడి యువకులు జాటోత్ నరేష్, నునావత్ లాలు, భూక్యా వీరు గమనించారు. వారు వెంటనే వాగులోకి దూకి, కిరణ్‌ను బయటకు తీసుకొచ్చారు. అతడి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. 'మీ సాహసం.. అతడికి పునర్జన్మను ప్రసాదించింది' అంటూ, ఆ యువకులను గ్రామస్తులు అభినందించారు.

పశువుల కాపరి అదృశ్యం

టేకులపల్లి, సెప్టెంబర్ 4: మండలంలోని జంగాలపల్లిలో పశువుల కాపరి అదృశ్యమయ్యాడు. బోడు ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు.. బర్లగూడెం పంచాయతీ జంగాలపల్లికి చెందిన పశువుల కాపరి నారగోని సుధాకర్(40), బుధవారం ఉదయం 6.00 గంటల సమయంలో పశువులను మేతకు తోలుకెళ్లాడు. ఉదయం 10.00 గంటలకు ఇంటికి పశువులు వచ్చాయి. సుధాకర్ మాత్రం రాలేదు. అతడిని ఉదయం 7.00 గంటల సమయంలో బురుదోనివాగు సమీపంలో తాము చూశామని గ్రామస్తులు కొందరు చెప్పారు. వాగు ప్రవాహ ఉధృతితో గల్లంతై ఉంటాడని వారు అనుమానిస్తున్నారు. సుధాకర్ కుమారుడు సాయి ఫిర్యాదుతో ఎస్సై శ్రీకాంత్ దర్యాప్తు చేస్తున్నారు. గ్రామస్తులు, గజ ఈతగాళ్లతో ఎస్సై శ్రీకాంత్ గాలింపు చేపట్టారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం, జీతం 16 K to 18K, ఏజెంట్ కమిషన్ 6K Ph: 9640258899/9640468899.
NT-331758

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన
ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, పాల్వంచ బ్రాంచ్ వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయుటకొని శ్రీమతి బొబ్బాల కల్పన, W/o: కృష్ణ, వయస్సు : 36 సం॥లు, వృత్తి : గృహిణి, నివాసం : ఇ.నెం. 25-1-136, యర్రగుంట, పాల్వంచ, పాల్వంచ మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి బప్పులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 5 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.
షెడ్యూలు ఆస్తి : జిల్లా రిజిష్ట్రారు ఖమ్మం, సబ్ రిజిష్ట్రారు వారి యిలాఖా కొత్తగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ మండలం, పాల్వంచ మున్సిపల్ పరిధిలో చేరిన, పాల్వంచ పట్టణ, యర్రగుంట యందు నేను మీకు విక్రయించిన (PTIN No. 1108013381), ఇంటి నెం. 25-1-122 (పార్ట్) సంబంధించిన ఆర్.సీ.సీ. బిల్డింగ్ అనుబంధమైన ఖాళీ స్థలంతో సహా గల దాని మొత్తం 125.33 చ॥గ॥ / 104.79 చ॥మీ॥, ఆర్.సీ.సీ. బిల్డింగ్ కట్టుబడి 310.50 చ॥అ॥,సిమెంటు రేకుల కప్పుతో కూడిన ల్యాట్రీన్ బాతురూం కట్టుబడి 30.00 చ॥అ॥,డాక్యుమెంట్ నెం. : 3056/2024 సదరు ఆస్తికి హద్దులు:తూర్పు:మన్యం కృష్ణమూర్తి గారి స్థలం, పడమర : మున్సిపల్ రోడ్డు, ఉత్తరం:మండల సత్యనారాయణ గారి ఇల్లు, దక్షిణం : మిగతా నా స్వంత ఇల్లు.
పలివెల గణేష్ బాబు, అడ్వకేట్, కొత్తగూడెం.
సెల్ : 9849246278

మన రాష్ట్రం మన పత్రిక నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

జల దిగ్బంధంలో ముంపు గ్రామాలు

చర్ల : నీట మునిగిన వరి చేను

ఇల్లెందు రూరల్ : పొంగిపొర్లుతున్న వాగు

చర్ల, సెప్టెంబర్ 4: వానలు-వరదలతో మండలంలో పంటలు దెబ్బతిన్నాయి. మండలంలో ప్రతి ఏటా దాదాపు 5,000 ఎకరాల్లో మిర్చి సాగవుతుంది. ఇక్కడి రైతులు ఎక్కువగా 341 రకం మిర్చి విత్తనాలు వాడుతుంటారు. 100 గ్రాముల ప్యాకెట్ రూ.7500కు కొనుగోలు చేశారు. దాదాపుగా 50 శాతం నారుమళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. గత ఏడాది అంతు చిక్కని వైరస్‌తో కొన్ని ప్రాంతాల్లో మిర్చి పంట పాక్షికంగా దెబ్బతిన్నది. ఈసారి కూడా వానలు-వరదల రూపంలో నష్టం వాటిల్లింది. కాల్వల కింద వరి నాట్లు పూర్తయ్యాయి. ఇవి వర్షాలకు నీట మునిగాయి. తమను ఆదుకోవాలని బాధిత రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

ఆగని వరద

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 4: వర్షం-వరద ఆగడం లేదు. మండలంలోని సత్యనారాయణపురం దర్గాకు వెళ్లే దారి పూర్తిగా నీట మునిగింది. రాకపోకలు పూర్తిగా స్తంభించాయి.

పునరావాస కేంద్రానికి తరలించాలి

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 4: లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రానికి తరలించాలని అధికారులను ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశించారు. ఇల్లెందు పట్టణంలోని బుగ్గవాగు బ్రిడ్జి వద్ద వరద ఉధృతిని మున్సిపల్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. లోతట్టు ప్రాంతాలైన బుగ్గవాగు బ్రిడ్జి, 3-5-20వ వార్డుల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించినట్లు చెప్పారు. బుగ్గ వాగు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

భారీ వర్షాలకు జాగ్రత్తలు పాటించాలి
-కొత్తగూడెం ఎస్ఈ మహేందర్‌రెడ్డి

లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబర్ 4 : భారీ వర్షాల నేపథ్యంలో వినియోగదారులు విద్యుత్ పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్ఈ మహేందర్ సూచించారు. వర్షాలు కురుస్తున్నప్పుడు తడిసిన స్తంభాలను ముట్టుకోవద్దని, తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా ఉన్న తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగెలను తాకరాదన్నారు. ఇంట్లో దుస్తులు ఆరేసే తీగలకు విద్యుత్ సరఫరా అయ్యే ప్రమాదం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

కూలిన ఇల్లు పరిశీలన

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబర్ 4: మండలంలోని తిరుమలకుంట గ్రామంలో మడకం బాబురావుకు చెందిన పూరిల్లు రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి నేలకూలింది. తహసీల్దార్ కృష్ణప్రసాద్ బుధవారం పరిశీలించారు. ప్రభుత్వం ఆదుకుంటుందని బాబురావుకు హామీ ఇచ్చారు. అతని కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్ మృతుల గుర్తింపు

మృతుల్లో రూ.25 లక్షల రివార్డు ఉన్న డీకేఎస్‌జెడ్‌సీఎం రణధీర్

9 మంది మృతులపై రూ.59 లక్షల రివార్డులు

వివరాలు వెల్లడించిన పోలీసు ఉన్నతాధికారులు

కొత్తగూడెం క్రైం, సెప్టెంబర్ 4 : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దండకారణ్యంలో మంగళవారం జరిగిన ఎదురు కాల్పుల్లో మృతిచెందిన మావోయిస్టుల మృతదేహాలను పోలీస్ అధికారులు గుర్తించారు. మృతిచెందిన 9 మందిపై రూ.59 లక్షల రివార్డులు ఉన్నాయని, మృతుల్లో డీకేఎస్‌జెడ్‌సీఎం రణధీర్ ఉన్నట్లు అధికారులు బుధవారం వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతేవాడ-బీజాపూర్ జిల్లాల సరిహద్దు లోహగావ్ పురంగేల్ అంద్రీ అడవుల్లో మంగళవారం భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో 9 మంది మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుల్లో మావోయిస్టు పార్టీ కీలక నేత, కేంద్ర మిలిటరీ ఇన్‌చార్జి, ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర బార్డర్ ఇన్‌చార్జి, దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు మాచర్ల యేసోబు అలియాస్ రణధీర్ ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం టేకులగూడెం గ్రామానికి చెందిన యేసోబు అలియాస్ రణధీర్ 1980లో మావోయిస్టు పార్టీ సిద్ధాంతాల పట్ల ఆకర్షితుడయ్యారు. అప్పటి నుంచి అంచలంచెలుగా ఎదుగుతూ అనేక కీలక పదవుల్లో బాధ్యతలు నిర్వర్తించి కేంద్ర కమిటీ స్థాయికి చేరారు. రణదేవ్ భార్య లక్ష్మక్క సైతం గత ఏడాది అనారోగ్యంతో మృతి చెందింది. కాగా.. ఎదురు కాల్పుల్లో రణదేవ్‌తో పాటు ఒక్కొక్కరిపై రూ.5 లక్షల రివార్డు ఉన్న 31వ నెంబర్ ప్లాటూన్ సభ్యురాలు కుమారి శాంతి, ఏరియా కమిటీ సభ్యురాలు సుశీల మడకం, కటేకళ్యాణ్ ఏసీఎం గంగీ ముచకీ, మాలంగిర్ ఏసీఎం కోసా మాద్వి, డీవీసీఎం సురక్షా దళం సభ్యురాలు లలిత, ఆంధ్ర-ఒడిశా బార్డర్ జోనల్ కమిటీ గార్డ్ కవిత, ఒక్కొక్కరిపై రూ.2 లక్షల రివార్డు ఉన్న డీవీసీఎం సురక్షా దళం సభ్యురాలు హిద్మే మడకం, ప్లాటూన్ సభ్యుడు కమలేష్ ఉన్నట్లు పోలీస్ అధికారులు ధ్రువీకరించారు. బస్తర్ రేంజ్‌లో ఈ ఏడాది మొత్తం 153 మంది మావోయిస్టులు ఎదురు కాల్పుల్లో మృతి చెందారని, 669 మంది మావోయిస్టులను అరెస్టు చేశామని, 656 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారని పోలీసు ఉన్నతాధికారి సుందర్ రాజ్ వెల్లడించారు.

కిన్నెరసాని-ముర్రేడు వాగుల మధ్య చిక్కుకున్న ఏడుగురు పశువుల కాపరులు
రక్షణ చర్యలు చేపట్టిన కలెక్టర్, అధికారులు
ఒకరు గల్లంతు, ఆరుగురు సురక్షితం

పాల్వంచలోని దంతెలబోర వద్ద రక్షణ చర్యలను పరిశీలిస్తున్న అధికారులు

పాల్వంచ రూరల్/సారపాక, సెప్టెంబర్ 4: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని దంతెలబోర గ్రామం వద్ద కిన్నెరసాని, ముర్రేడు వాగులు కలిసే చోట ఏడుగురు పశువుల కాపరులు బుధవారం వరద నీటిలో చిక్కుకున్నారు. సమాచారం తెలుసుకున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ పాల్వంచ, బూర్గంపాడు మండలాల రెవెన్యూ, పోలీసు అధికారులతో కలిసి రక్షణ చర్యలు చేపట్టారు. పశువులకాపరుల్లో ఉప్పుసాకకు చెందిన జారే సాయికృష్ణ గల్లంతు కాగా, మిగతా వారు క్షేమంగా ఒడ్డుకు చేరారు. దంతెలబోర, గంగదేవిగుప్ప, ఉప్పుసాక ప్రాంతాలకు చెందిన దాదాపు 90మేకలు, పశువులు మేత కోసం దంతెలబోర నుంచి వాగులోకి వెళ్లాయి. ఆ సమయంలో కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి 53 వేల క్యూసెక్కుల నీరు వెళ్తున్నది. పశువులను తోలుకుని వచ్చేందుకు పశువుల కాపరులు సాయంత్రం ఆ ప్రాంతానికి వెళ్లారు. అదే సమయంలో ఒకేసారి ముర్రేడు వాగు ఉధృతి పెరిగి వరద వారు ఉన్న ప్రాంతాన్ని చుట్టుముట్టింది. సమాచారం తెలుసుకున్న దంతెలబోర గ్రామస్తులు విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపారు. పశువుల కాపరుల్లో దంతెలబోరకు చెందిన తటుకుల కేదారి, దేశబోయిన ఈశ్వరయ్య, మంచినీళ్ల ముసలయ్య, గంగదేవిగుప్పకు చెందిన కుంజా భద్రయ్య, ఇర్సా నగేష్, మసం కళ్యాణ్, ఉప్పుసాకకు చెదిన జారేసాయి కృష్ణ ఉన్నారు. కలెక్టర్‌తోపాటు రెవెన్యూ, పోలీస్ అధికారులు సంగం వైపు, బూర్గంపాడుకు చెందిన అధికారులు సోంపేట వద్ద బోట్లు, పడవలు, తాళ్ళతో రక్షణ చర్యలు ప్రారంభించారు. అధికారులు కిన్నెరసాని గేట్లను మూసివేయించి నీటి విడుదలను నిలిపివేశారు. ముగ్గురు పశువుల కాపరులు ఈత కొట్టుకుంటూ పాల్వంచలోని సంగం వైపు వస్తుండగా.. సాయికృష్ణ గల్లంతయ్యాడు. మరో నలుగురు తాళ్ళ సాయంతో బూర్గంపాడు మండలం సోంపేటకు చేరుకున్నారు. గల్లంతైన సాయి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

వరద మృతుల కుటుంబాలకు సాయం

చెక్కు ఇస్తున్న కోరం కనకయ్య, వేణుగోపాల్

టేకులపల్లి, సెప్టెంబర్ 4: వరద మృతుల కుటుంబాలకు ప్రభుత్వం సాయం అందించింది. మండలంలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన కోరం వెంకటేశ్వర్లు, దొడ్డ సాయికుమార్ కలిసి బంధువుల ఇంట శుభకార్యానికి వెళ్లి, ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. మొట్లగూడెం-ఆళ్లపల్లి మండలం రాయిపాడు గ్రామాల మధ్య కిన్నెరసాని వాగు దాటుతున్నారు. వరద ప్రవాహ ఉధృతికి వారిద్దరూ కొట్టుకుపోయి మృతిచెందారు. వారి కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల చొప్పున చెక్కులను అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య బుధవారం అందించారు. తహసీల్దార్ నాగభవాని, ఎంపీడీవో రవీందర్‌రావు, ఎంపీవో గణేష్ గాంధీ, ఆర్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే పరామర్శ

టేకులపల్లి, సెప్టెంబర్ 4: కోరం వెంకటేశ్వర్లు, దొడ్డ సాయికుమార్ కుటుంబాలను ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే కోరం కనకయ్య బుధవారం లచ్చగూడెంలో పరామర్శించారు. నాయకులు కోరం సురేందర్, మధురెడ్డి, అజ్మీరా శివ, భూక్యా దేవానాయక్, భద్రు, గణేష్ పాల్గొన్నారు.

ఆస్పత్రి తనిఖీ

రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట, సెప్టెంబర్ 4: స్థానిక ప్రభుత్వ వైద్యశాలను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను, డయాలసిస్ యూనిట్ పనితీరును పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. వైద్య సేవలపై ఆరా తీశారు.

ఇంకుడు గుంతలను పూర్తి చేయండి

అశ్వారావుపేట, సెప్టెంబర్ 4: గ్రామాలవారీగా నిర్దేశించిన ఇంకుడు గుంతల నిర్మాణ లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఈజీఎస్ సిబ్బందిని అడిషనల్ పీడీ రవి ఆదేశించారు. గ్రామాల జనాభా ప్రాతిపదికన నిర్దేశిత లక్ష్యాన్ని గడువులోగా పూర్తి చేయాలన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ ఉద్యోగులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. మునగ సాగుపై ఆసక్తిగల రైతులను గుర్తించి, వారికి అవగాహన కల్పించాలని అన్నారు.

కాంగ్రెస్ దాడికి ఖండన

దమ్మపేట, సెప్టెంబర్ 4: ఖమ్మంలో వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చిన మాజీ మంత్రి హరీష్‌రావు వాహనంపై కాంగ్రెస్ మూక దాడిని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో ఖండించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టేకులపల్లి, సెప్టెంబర్ 4: టేకులపల్లి, బొమ్మనపల్లి సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతు పనుల కారణంగా గురువారం ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈలు దేవ, బుజ్జి కన్నయ్య తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్షతగాత్రుడు మృతి

అశ్వారావుపేట, సెప్టెంబర్ 4: విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని అచ్యుతాపురం గ్రామస్తుడు పసుపులేటి చిన్న పోలయ్య(56) తాపీ కార్మికుడు. తన ఇంటి వద్ద మంగళవారం సెంట్రింగ్ పని చేస్తుండగా విద్యుత్ వైర్ తగిలింది. తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబ సభ్యులు చికిత్స కోసం సత్తుపల్లి ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రికి తీసుకెళ్లారు. అతడు అక్కడే బుధవారం మృతి చెందాడు. అతడి భార్య గోవిందమ్మ ఫిర్యాదుతో కేసు నమోదైంది. ఎస్సై శివరామకృష్ణ దర్యాప్తు చేస్తున్నారు

కొండరెడ్ల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబర్ 4: కొండరెడ్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిందని తహసీల్దార్ కృష్ణప్రసాద్ తెలిపారు. మండలంలోని రెడ్డిగూడెం పంచాయతీ బండారుగూడెం గ్రామంలో బుధవారం వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కొండరెడ్ల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలను ఐటీడీఏ చేపట్టిందన్నారు. ఆర్ఐ పద్మ, కార్యదర్శి సబిత, వెలుగు సీసీ నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

10 కిలోల గంజాయి పట్టివేత

పాల్వంచ రూరల్, సెప్టెంబర్ 4 : ఒరిస్సా రాష్ట్రం నుంచి కొత్తగూడెం వైపు ద్విచక్ర వాహనంపై గంజాయిని తరలిస్తున్న ముగ్గురిని పాల్వంచరూరల్ పోలీసులు బుధవారం రాత్రి సోములగూడెం క్రాస్‌రోడ్డు వద్ద పట్టుకున్నారు. సోములగూడెం వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా.. ద్విచక్రవాహనంపై అనుమానంతో వెళ్తున్న ముగ్గురిని ఆపి తనిఖీ చేయగా వారి వద్ద పదికిలోల గంజాయి లభించింది. గంజాయితోపాటు ద్విచక్రవాహనం, గంజాయి తరలిస్తున్న ఒరిస్సాకు చెందిన మతిలి, జగన్నాథ్ పైపారి, తాలుతంతి అనే ముగ్గురిని ఎస్సై సురేస్ అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

కళాకారుడు బాషాకు పురస్కారం

పాల్వంచ, సెప్టెంబర్ 4 : పాల్వంచ పట్టణానికి చెందిన జూనియర్ గద్దర్ ధూంధాం కళాకారుడు ఎస్‌కే బాషాకు తొర్రూర్‌లో జరిగిన కళా సాంస్కృతిక కార్యక్రమంలో గిద్ద గళం ఆధ్వర్యంలో ప్రజాకవి గద్దర్ అవార్డును అందజేశారు. గిద్దె రామనర్సయ్య, ప్రొఫెసర్ ఖాసీం చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పాల్వంచ, సెప్టెంబర్ 4 : మున్సిపాలిటీలోని బొల్లోరిగూడెంలో బుధవారం పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పాల్వంచ పోలీసులు అరెస్టు చేశారు. పట్టణ ఎస్సై సుమన్ దాడి చేసి వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. రూ.13,800 నగదు, ఐదు సెల్‌ఫోన్లు సీజ్ చేశారు.

మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలి

కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 4: పర్యావరణ పరిరక్షణలో భాగంగా అందరూ మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహాల పోస్టర్లను బుధవారం కలెక్టర్ ఆవిష్కరించారు. పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకొని పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. అవగాహన కార్యక్రమాల్లో భాగంగా బస్టాండ్, జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో వాల్‌పోస్టర్లను ప్రదర్శన చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్య ఆదాయం లెక్కింపు

బూర్గంపహాడ్ (భద్రాచలం), సెప్టెంబర్ 4: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయ హుండీల ఆదాయాన్ని ఈవో రమాదేవి సమక్షంలో ఉద్యోగులు బుధవారం లెక్కించారు. 44 రోజులకుగాను రూ.60,81,779తోపాటు 94 గ్రాముల బంగారం, 555 గ్రాముల వెండి, యూఎస్ డాలర్స్ 288, యూఏఈ దీరమ్స్ 410, కెనడా డాలర్స్ 60, ఎన్స్‌లాండ్ పౌండ్స్ 10, నేపాల్ రూపీస్ 50, ఒమన్ రేల్ 100 వచ్చినట్లు ఈవో వివరించారు. ఈ ఆదాయాన్ని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో జమ చేసినట్లు చెప్పారు.

గోదారమ్మ శాంతించాలని నదీహారతి

బూర్గంపహాడ్ (భద్రాచలం), సెప్టెంబర్ 4: గోదారమ్మ శాంతించాలని వేడుకుంటూ భద్రాచలం రామాలయం ఈవో రమాదేవి, అర్చకులు బుధవారం సాయంత్రం నదీమతల్లికి హారతి ఇచ్చారు. ఆలయ ఈవో రమాదేవి హారతి ఇచ్చి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండేలా చూడాలని కోరుతూ రామయ్యకు అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు.

భద్రాద్రి రామయ్యకు నిత్య కల్యాణం

బూర్గంపహాడ్ (భద్రాచలం), సెప్టెంబర్ 4: భద్రాచలం సీతారామచంద్ర స్వామికి అర్చకులు బుధవారం నిత్య కల్యాణం నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.

బీఈడీ అభ్యర్థుల జాబితా విడుదల

బూర్గంపహాడ్ (భద్రాచలం), సెప్టెంబర్ 4: 2024-26 విద్యాసంవత్సరానికి ప్రభుత్వ గిరిజన బీఈడీ కళాశాలలో ప్రవేశానికి ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఐటీడీఏ పీవో రాహుల్ బుధవారం తన చాంబర్‌లో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. మొత్తం 100 సీట్లు ఉన్నాయన్నారు. డిగ్రీ మార్కుల మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎంపికైన వారికి ఈ నెల 13న ఉదయం 10.00 గంటలకు కళాశాలలో కౌన్సిలింగ్ ని